సాక్షి
మహబూబాబాద్

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



సాంస్కృతిక ఉత్సవంతో..

దివ్యాంగ కళాకారుల ప్రతిభను వెలికితీసేందుకు సాంస్కృతిక ఉత్సవం దోహదం చేస్తుందని హనుమకొండ దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి జయంతి అన్నారు. - 8లో▸



సీటు..ఫైట్

సీటు కోసం ఆర్టీసీ బస్సులో యువకులు కొట్టుకున్న ఘటన జిల్లాలోని తొర్రూరు బస్టాండ్‌లో చోటు చేసుకుంది. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.2^0 /21.1^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు కాస్త ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలి తీవ్రత ఉండి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నందున నేటి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు.

మణుగూరు ఎక్స్‌ప్రెస్ హోల్టింగ్‌ను పునరుద్ధరించాలి



గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో మణుగూరు ఎక్స్‌ప్రెస్ హోల్టింగ్‌ను పురుద్ధరించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రెండేళ్లుగా గార్లలో మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు నిలుస్తుండగా, ఇటీవల రైల్వే ఉన్నతాధికారులు నిలుపుదలను రద్దు చేయడంతో మండల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందుకు ఎంపీ సానుకూలంగా స్పందించి, రైల్వే జీఎంను కలిసి గార్లలో రైలు నిలుపుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేశ్, రాధాకృష్ణ, మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలి



మహబూబాబాద్ అర్బన్: వరంగల్–ఖమ్మం–నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పింగిళి శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆదివారం పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీపాల్‌రెడ్డి ఎమ్మెల్సీగా గెలువగానే పీఆర్‌సీ, సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలు ఇప్పిస్తామన్నారు. గతంలో ఎన్నో జీఓలు తీసుకువచ్చి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందుందన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన వెంకన్న, రవీందర్, నాగేందర్‌రావు, శ్రీనివాస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాస్, బాబురెడ్డి, మమత, తారక్, శ్యామలాదేవి, అరుణ, భూక్య రాంజీనాయక్, గీత, ఉమాదేవి, వెంకట్‌రెడ్డి, సునీత, కౌసల్య, సుశీల, నవీన్, హల్యా, చిట్టిబాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డీటీసీ పుప్పాల శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు?!

సాక్షిప్రతినిధి, వరంగల్ : రవాణాశాఖ వరంగల్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పని చేసిన పుప్పాల శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిసింది. ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు శ్రీనివాస్‌తో పాటు ఆయన బంధువులు, కుటుంబసభ్యుల ఇళ్లలో ఈనెల 7న సోదాలు నిర్వహించిన సంగతి తెలిసింది. ఈ మేరకు రూ.4.04 కోట్ల అక్రమాస్తులను ప్రాథమికంగా గుర్తించిన ఏసీబీ.. ఆయనపై అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(1)(బి), 13(2)తో పాటు తెలంగాణ ఎక్సైజ్ చట్టం–1968 కింద కేసులు మోపి వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరు పర్చింది. ఈ మేరకు కోర్టు ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో పుప్పాల శ్రీనివాస్‌ను రవాణాశాఖ కమిషనర్ సస్పెండ్ చేసినట్లు అధికారవర్గాల సమాచారం. కాగా ఉమ్మడి వరంగల్‌కు నోడల్ అధికారిగా ఉన్న హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ స్థానంలో సీనియర్ డీటీసీని నియమించేందుకు కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. త్వరలోనే ఉత్తర్వులు వెలువడనుండగా.. అంతకంటే ముందు సీనియర్ ఎంవీఐకి జిల్లా రవాణా శాఖ అధికారి(డీటీఓ)గా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం రవాణాశాఖ హనుమకొండ జిల్లా కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రాథోడ్‌కు, లేదంటే మరో ఎంవీఐ వేణుగోపాల్ రెడ్డిలో ఒకరికి ఇన్‌చార్జ్ డీటీఓ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. రెండు రోజుల్లో ఈ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని రవాణాశాఖ ఉన్నతాధికారవర్గాల ద్వారా తెలిసింది.

ప్రధాన ఆలయ గోపురంపై కలశానికి అభిషేకం చేస్తున్న సచ్చిదానందసరస్వతి, పాల్గొన్న మంత్రులు సురేఖ, శ్రీధర్‌బాబు తదితరులు





కలశం తీసుకువస్తున్న అర్చకుడు కృష్ణమూర్తిశర్మ, అనుగ్రహ భాషణం చేస్తున్న సచ్చిదానందసరస్వతిస్వామి





మహా కుంభాభిషేకం

కాళేశ్వరంలో 42 ఏళ్ల తర్వాత అపూర్వ ఘట్టం ఆవిష్కృతం

- సచ్చిదానందసరస్వతిస్వామి చేతుల మీదుగా ఆలయ ప్రధాన గోపుర కలశానికి సంప్రోక్షణ
- హాజరైన రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- వేడుకను తిలకించేందుకు తరలివచ్చిన భక్తజనం

కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానంలో 42 ఏళ్ల తర్వాత అరుదైన సంప్రోక్షణ ఘట్టాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానందసరస్వతిస్వామి చేతుల మీదుగా ప్రధాన ఆలయ గోపుర కలశానికి మహాకుంభాభిషేకం పూజా క్రతువు పూర్తి చేశారు. అదే సమయంలో అనుబంధ ఆలయాల గోపురాల కలశాలకు సంప్రోక్షణ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి దంపతుల ఆధ్వర్యాన చేపట్టారు. ఈ పూజా కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తోపాటు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తదితరులు హాజరయ్యారు. – కాళేశ్వరం - వివరాలు 8లో▸

మోటార్లు మాయం!

వ్యవసాయ బావులకు అమర్చిన విద్యుత్ మోటార్లు చోరీ

- రాగి వైరు అపహరించుకెళ్తున్న దుండగులు
- ప్రాణాపాయమని తెలిసినా యథేచ్ఛగా దొంగతనాలు



మహబూబాబాద్ రూరల్: వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్లు, స్టార్టర్లు చోరీకి గురవుతున్నాయి. ఏటా యాసంగిలో పంట పొలాలకు సాగునీరు అందించేందుకు రైతులు మోటార్లు అమర్చుతారు. అయితే అర్ధరాత్రి పొలాల్లో దొంగలు చొరబడి మోటార్లను ఎత్తుకెళ్తున్నారు. మోటారు నుంచి కాపర్(రాగి) వైరును బయటకు తీసి విక్రయిస్తున్నారు. చీకట్లో విద్యుత్ వైర్లను కత్తిరించడం అపాయమని తెలిసినా వెనక్కి తగ్గడం లేదు. జిల్లావ్యాప్తంగా వంద వరకు దొంగతనాలు జరిగినా.. కొన్ని మాత్రమే వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా దుండగులు పొల్లాలోని పాత ట్రాన్స్‌ఫార్మర్ల ప్రాంతాలను టార్గెట్ చేసి మోటార్లు, స్టార్టర్లను ఎత్తుకెళ్తున్నారు. 15 హెచ్‌పీ మోటారులో 10కిలోల కాపర్, 10 హెచ్‌పీ మోటారులో 6 కిలోల కాపర్, 5 హెచ్‌పీ మోటారులో 4నుంచి నాలుగున్నర కిలోల కాపర్ వైరు ఉంటుంది. మార్కెట్‌లో కిలో కాపర్ వైరు ధర రూ.1,500 పలుకుతుండగా ఇదే అదునుగా భావించి దొంగలు విద్యుత్ మోటార్లను చోరీ చేస్తున్నారు.

రైతులకు ఇబ్బందులు..

విద్యుత్ మోటార్ల చోరీ వల్ల రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. దొంగలు విద్యుత్ వైర్లను ప్రమాదకరంగా కత్తిరించి అలానే వదిలేస్తుండడంతో రైతులకు ప్రమాదం పొంచి ఉంటోంది. మోటార్ల చోరీ వల్ల సాగునీటి ఇబ్బందులతో పాటు తమపై అదనపు భారం పడుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పోలీస్‌శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించి చోరీలను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.

100 వరకు..

జిల్లాలోని కొత్తగూడ ప్రాంతంలో మూడు అల్యూమినియం కేసులు నమోదు అయ్యాయని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అధికారికంగా 32 విద్యుత్ చోరీ కేసులు నమోదు కాగా.. 21ఛేదించామని జిల్లా పోలీసు అధికారులు పేర్కొన్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా వంద వరకు విద్యుత్ మోటార్లు చోరీకి గురైనట్లు విశ్వసనీయ సమాచారం. మోటార్ల చోరీ విషయంలో పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవలికాలంలో దొంగలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని కాపర్ వైరును ఎత్తుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి.



'ఈ ఫొటోలోని మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామ పంచాయతీ పరిధిలోని వెంక్యతండాకు చెందిన రైతు బానోత్ లక్‌పతి తమ వ్యవసాయ బావికి అమర్చిన నీళ్లలోని రూ.30 వేల విలువైన విద్యుత్ మోటారు అపహరణకు గురైంది. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ కనెక్షన్లు తొలగించి విద్యుత్ మోటారుతో పాటు దానికి ఏర్పాటు చేసిన రాగి వైరును అపహరించుకుపోయారు. ఏడాది క్రితం ఇదే విధంగా బావి పైభాగంలో అమర్చిన రూ.15 వేల విలువైన మోటార్‌ను దొంగలు పగులగొట్టారు.'

రెండేళ్ల క్రితం కేసు పెడితే ఇంతవరకు ఆచూకీలేదు..



రెండేళ్ల క్రితం మా వ్యవసాయ బావికి అమర్చిన విద్యుత్ మోటార్‌ను దొంగలు ఎత్తుకుపోతే మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టిన.. అయితే ఇంతవరకు మోటార్ ఆచూకీ లభించలేదు. మాలాగే ఎంతోమంది రైతుల నీళ్లలోని మోటార్లు, పైభాగంలో అమర్చిన మోటార్లు కనిపించకుండా పోతున్నాయి.

– దాసరి ఉప్పలమ్మ, అయోధ్య

పోలీసులు పట్టించుకోవడం లేదు..



మూడు నెలల క్రితం మా వ్యవసాయ బావికి పైభాగంలో అమర్చిన రూ.12 వేల విలువగల మోటార్ పోయింది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చి చూసి వెళ్లారు. కేసు నమోదు చేయకుండా వదిలేశారు. ఇలాగే గతంలో కూడా పదికి పైగా మోటార్లు దొంగలు ఎత్తుకెళ్లగా పోలీసులకు ఫిర్యాదు చేసినా ఒక్కటి కూడా దొరకలేదు.

– వాంకుడోత్ రమేశ్, ముత్యాలమ్మతండా

కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం



వ్యవసాయ బావులకు అమర్చిన విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్న ఘటనల్లో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నమోదైన విద్యుత్ మోటార్ దొంగతనం కేసులను ఛేదిచాం. మిగిలినవి కూడా ఛేదించి దొంగలను పట్టుకుని మోటార్లు రికవరీ చేసి రైతులకు అప్పగిస్తాం. దొంగల ఆచూకీ కోసం ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేస్తున్నాం.

– ఎన్.తిరుపతిరావు, డీఎస్పీ

మేడారానికి జాతర కళ

- మినీ జాతరకు మిగిలింది రెండు రోజులే..

ములుగు జిల్లా ఎస్ఎస్‌తాడ్వాయి మండలంలోని మేడారం మినీ జాతరకు ఇంకా రెండు రోజులే మిగిలి ఉండడంతో ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం అమ్మవార్లను దర్శించుకున్నారు. సుమారు 20వేల మంది భక్తులు వనదేవతల దర్శనానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. – ఎస్ఎస్‌తాడ్వాయి



మేడారంలో వనదేవతల దర్శనానికి క్యూకట్టిన భక్తజనం - వివరాలు 8లో▸

బొమ్మల చదువు..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో రంగురంగల బొమ్మలతో అలకంరణ
- చిన్నారులను ఆకర్శిస్తున్న సెంటర్లు



గోడపై బొమ్మలతో బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

దోర్నకల్: చిన్నారులను ఆకట్టుకునేలా అంగన్‌వాడీ కేంద్రాలు ముస్తాబవుతున్నాయి. దోర్నకల్ మున్సిపాలిటీతో పాటు మండలంలో 106 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 18 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. గతంలో అమ్మపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా గుర్తించి భవనం గదులకు రంగులతో బొమ్మలు వేయడంతో పాటు వసతులు కల్పించారు. ఇటీవల జిల్లాలో 40 అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వప్రాథమిక పాఠశాలలుగా మార్చి రంగురంగుల బొమ్మలతో ముస్తాబు చేశారు. దోర్నకల్ మండలంలో కస్నాతండా, హరిశ్చంద్రుతండా కేంద్రాలను పూర్వపాఠశాలలుగా మార్చారు. తెలుగు, ఇంగ్లిష్ అక్షరమాలలు, శరీర భాగాల వివరాలు, వివిధ రకాల జంతువులు, నెలల పేర్లు, పలు ఇంగ్లిష్ పదాలు, పిల్లల దినచర్య, పాఠశాలలో భోజనాలకు సంబంధించిన వివరాలతో గోడలపై బొమ్మలు చిత్రించారు. ఈ బొమ్మలు చిన్నారులను విశేషంగా ఆకర్శిస్తున్నాయి. పూర్వ ప్రాథమిక పాఠశాలకు వస్తున్న పిల్లలకు గోడలపై బొమ్మలతో బోధించడం తేలికగా ఉందని, పిల్లలు కూడా ఉత్సాహంగా అక్షరాలు, పదాలను నేర్చుకుంటున్నారని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు.

కంఠమహేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలి

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్



మరిపెడ కంఠమహేశ్వర స్వామి ఆలయం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మరిపెడ రూరల్: కంఠమహేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. ఆదివారం మరిపెడ మండల కేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి–సురమాంబల కల్యాణ మహోత్సవం సందర్భంగా పూజా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. చివరి రోజు బలిదానం, మొకు, ముస్తాదుల పూజలు, వన మహోత్సవ కార్యక్రమంతో పండుగ వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు యుగేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబరీష, కాలం రవీందర్‌రెడ్డి, విసారపు శ్రీపాల్‌రెడ్డి, గౌడకుల పెద్ద గంధసిరి రామన్న, భిక్షపతి, గుండగాని వెంకన్న, గంధసిరి రవి, పొన్నం వినయ్, లింగమూర్తి, రవి, గౌడ కుల పెద్దలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలన

కురవి: మండల కేంద్రంలోని ఆలయం పక్కన నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ ఆదివారం పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న డబుల్‌బెడ్ ఇళ్ల పక్కన వీరభద్రస్వామి ఆలయం కైలాస భవన స్థలాన్ని పరిశీలించారు. ఎవరికి ఇబ్బంది కలగకుండా ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఆలయానికి సంబంధించిన స్థలంలోకి ఎవరు రావద్దని సూచించారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, ఎర్ర నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

జాతరలో భక్తులకు మెరుగైన వైద్యసేవలు



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మేడారం మినీ జాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలందిస్తామని డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు అన్నారు. ఆదివారం మేడారంలోని టీడీడీ కల్యాణ మండపంలో వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. భక్తులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీడీ కల్యాణ మండపం, జంపన్న వాగు, ఆర్టీసీ బస్టాండ్ వైజంక్షన్, బయ్యక్కపేట గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఒక్కో వైద్య శిబిరానికి ప్రోగ్రాం ఆఫీసర్లను నియమించామన్నారు. ఈ నెల 12నుంచి 15వ తేదీ వరకు 24గంటలు జాతరకు వచ్చే భక్తులకు వైద్యసేవలు అందిస్తామన్నారు. ఈజీసీ, మెడికల్ కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యసేవల కోసం 108అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నామినేషన్ల ఘట్టానికి నేటితో తెర!

- ఇప్పటికే 23 సెట్లలో 17 మంది నామినేషన్లు..
- రేపు పరిశీలన.. 13న ఉపసంహరణ
- సై అంటే సై అంటున్న స్వతంత్ర అభ్యర్థులు
- రసవత్తరంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు



నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి

సాక్షిప్రతినిధి, వరంగల్ : వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం సోమవారం ముగియనుంది. ఎన్నికల కమిషన్ జనవరి 29న షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 3 ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా అదే రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. శుక్రవారం నాటికి పూర్వ వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి ఉపాధ్యాయ ప్రధాన సంఘాలు బలపరిచిన అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కలిపి 17 మంది 23 సెట్లలో నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. శనివారం, ఆదివారం సెలవు కావడంతో ఆశావహులందరూ చివరి రోజు సోమవారం నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది.

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు 13 మంది స్వతంత్రులు 16 సెట్లలో నామినేషన్లు వేశారు. ప్రధాన సంఘాలు బలపరిచిన నలుగురు మరో ఏడు సెట్లలో నామినేషన్లు భారీ ర్యాలీల నడుమ దాఖలు చేశారు. ఇప్పటి వరకు బీజేపీ అభ్యర్థిగా పులి సరోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి టీచర్స్ జేఏసీ మద్దతుతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఎమ్మెల్సీ, టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూ–టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఏలె చంద్రమోహన్, దామెర బాబూరావు, తలకొప్పుల పురుషోత్తంరెడ్డి, డాక్టర్ పోలెపాక వెంకటస్వామి, సంగంరెడ్డి సుందర్‌రాజ్, చాలిక చంద్రశేఖర్, కంటె సాయన్న తదితరులు నామినేషన్ వేసిన వారిలో ఉన్నారు. సోమవారం కూడా పూర్వ మూడు జిల్లాల నుంచి నామినేషన్లు వేసేందుకు నల్లగొండకు తరలనుండగా.. మరుసటి రోజు మంగళవారం అధికారులు నామినేషన్ పత్రాలను పరిశీలించనున్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణ.. అదేరోజు సాయంత్రం బరిలో ఉండే అభ్యర్థుల పేర్లు, గుర్తులు, ఖరారు కానున్నాయి.

రసవత్తరంగా పోరు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు ఈనెల 14 నుంచి రసవత్తరంగా మారనుంది. ప్రచారం హోరెత్తించేందుకు అభ్యర్థులు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో 191 మండలాల నుంచి 24,905 మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకోనుండగా.. హనుమకొండ జిల్లాలో అత్యధికంగా పురుషులు, స్త్రీ ఓటర్లు కలిపి 5,098 మంది ఉండగా.. అత్యల్పంగా సిద్దిపేట జిల్లాలోని నాలుగు మండలాల నుంచి 163 మంది ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 4,483, ఖమ్మం 3,955, సూర్యాపేట 2,637, వరంగల్ 2,225, భద్రాద్రి కొత్తగూడెం1,949, మహబూబాబాద్1,618, యాదాద్రి 921, జనగామ 921, ములుగు 612, జేఎస్ భూపాలపల్లిలో 323 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. కాగా, నామినేషన్ల ఘట్టం ముగియడమే తరువాయి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుందన్న చర్చ ఆ వర్గాల్లో సాగుతోంది.

హేమాచలక్షేత్రంలో భక్తుల కోలాహలం

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండల పరిధిలోని హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో ఆలయం ప్రాంగణంతో పాటు చింతామణి జలపాతం, వనదేవత ప్రాంతం కోలాహలంగా కనిపించింది. వివిధ వాహనాల్లో ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్న భక్తులు ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి హేమాచల కొండపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు దర్శించుకుని పూలు, పండ్లు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ, కారంపుడి పవన్‌కుమార్ ఆచార్యులు, స్వామివారికి తిలతైలాభిషేకం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న భక్తులకు పూజారులు గోత్ర నామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణం వివరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు.

క్లుప్తంగా

రైల్వే గేట్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● అరగంట పాటు రాకపోకలకు అంతరాయం

కమలాపూర్: మండలంలోని ఉప్పల్ రైల్వే గేట్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో సుమారు అరగంట పాటు రైళ్లు, హుజూరాబాద్–పరకాల మార్గంలో ప్రయాణించే వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. స్థానికుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ నుంచి పరకాలకు వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సు ఆదివారం ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలో హుజూరాబాద్–పరకాల మార్గంలోని రైల్వే గేట్ తెరుస్తున్న క్రమంలో ఢీకొంది. దీంతో గేట్ వంగి పనిచేయకపోవడంతో వాహనాలతో పాటు రైళ్ల రాకపోకలకు సుమారు అరగంట పాటు అంతరాయం కలిగింది. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు హుటాహుటిన తాత్కాలిక మరమ్మతులు చేపట్టి మ్యానువల్ గేట్ సాయంతో రాకపోకలు పునరుద్ధరించారు.

క్షుద్ర పూజల కలకలం..



క్షుద్ర పూజలు చేసినట్లు భావిస్తున్న ప్రాంతంలోని సామగ్రి

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్‌లో క్షుద్ర పూజలు కలకలం సృష్టించాయి. జిల్లా కేంద్రం శివారులోని ముత్యాలమ్మ తండా, చెరువు కొమ్ము తండా బోర్డు సమీపంలో దుండగులు క్షుద్ర పూజలు చేసినట్లు పూజాసామగ్రి కనిపించడంతో ఆదివారం స్థానికులు భయాందోళనకు గురయ్యారు. శనివారం అర్ధరాత్రి క్షుద్ర పూజలు జరిగినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలిలో బియ్యం, కత్తి, గుమ్మడికాయ, తదితర పదార్థాలతో పూజలు చేసినట్లు రోడ్డుపై కనిపించాయి.



పూర్ణాహుతిలో వేదపండితులు



కలశానికి అక్షింతలు వేసి మొక్కుతున్న మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు



కలశపూజ చేస్తున్న పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతిస్వామి

అపురూప ఘట్టం ఆవిష్కృతం



మహాకుంభాభిషేక పూజలకు హాజరైన భక్తులు

42 ఏళ్ల తర్వాత శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం

● మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు
● పీఠాధిపతి సచ్చిదానందసరస్వతి స్వామితో కలశానికి సంప్రోక్షణ
● పాల్గొన్న ముగ్గురు రాష్ట్ర మంత్రులు
● తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మహాకుంభాభిషేక పూజా క్రతువును వేదపండితులు సంప్రోక్షణ కార్యక్రమంతో సుసంపన్నం చేశారు. 7న (శుక్రవారం) ప్రారంభమైన శతచండి, మహారుద్ర సహిత సహస్ర ఘటాభిషేకం, మహాకుంభాభిషేక పూజలు 9వ తేదీ వరకు (ఆదివారం) వైభవోపేతంగా జరిగాయి. ఈమూడు రోజుల పాటు అచ్చలాపురం వేదపాఠశాల అవధాని దుద్దిళ్ల మనోహరశర్మ ఆధ్వర్యంలో 50 మంది రుత్వికులు పూజాతంతు కనుల పండువగా నిర్వహించారు. మూడో రోజు ఆదివారం ఉదయం 7.30 నుంచి 10గంటల వరకు వేదపండితులు ప్రాతఃసూక్త మంత్ర పఠనం, ప్రాతఃకాల పూజలు చేశారు. రుద్రహవనం, జయాదుల బలిహరణం, పూర్ణాహుతి హోమాలను పండితులు దేవస్థానం ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ దంపతులతో పూర్తి చేశారు.

ముహూర్తం ప్రకారమే..

ముహూర్తం ప్రకారం ఉదయం 10.42గంటలకు తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానందసరస్వతి స్వామి చేతుల మీదుగా ప్రధాన ఆలయంపై గోపురం కలశానికి మహా కుంభాభిషేకం చేశారు. అనంతరం మంత్రపుష్పం నిర్వహించారు. ఒకే సమయంలో దేవస్థానం తూర్పు రాజగోపురంతోపాటు ఇతర గోపురాలు, అనుబంధ ఆలయాలకు మహాకుంభాభిషేకం సంప్రోక్షణను వేదపండితులతో జరిపించారు. ఈకార్యక్రమం ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

వీక్షణకు ఎల్‌ఈడీ స్క్రీన్‌లు..

మహాకుంభాభిషేకం సంప్రోక్షణ నిర్వహణకు గోపురాలు, ఆలయాలపై పరంజా(కర్ర)లతో నిర్మాణం చేశారు. 15మంది వరకు సామర్థ్యంతో నిర్మాణం జరిగింది. దీంతో భక్తులు పైకి వెళ్లడానికి వీలులేపోవడంతో దేవాదాయశాఖ అధికారులు రాజగోపురం ఎదుట, అభిషేక మండపం వద్ద, దక్షిణ గోపం వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయగా భక్తులు తిలకించారు. డ్రోన్ ద్వారా వీడియోను చూపించారు.



సంప్రోక్షణలో మంత్రులు సురేఖ, ప్రభాకర్, శ్రీధర్‌బాబు

ప్రయాగ్‌రాజ్‌లా కాళేశ్వరానికి ప్రాముఖ్యత..

కుంభమేళాకు పుణ్యస్నానాలకు గంగా, యమున, అంతర్వాహిణి సరస్వతి నదులకు ప్రయాగ్‌రాజ్‌కు ఎలా వెళ్తారో కాళేశ్వరంలోని గోదావరి, ప్రాణహిత అంతర్వాహిణి సరస్వతి మూడు నదులకు అంతటి ప్రాముఖ్యత ఉందని తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానందసరస్వతిస్వామి అన్నారు. వచ్చే మే నెలలో సరస్వతి పుష్కరాలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే రూ.25కోట్లు ఇచ్చిందని, పుష్కరాలను వైభవంగా నిర్వహించనుందని తెలిపారు. మహాకుంభాభిషేకంతో పాటు సరస్వతి పుష్కరాలు జరపడం ప్రభుత్వం, పాలకులు, ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. అనంతరం మంత్రులు శ్రీధర్‌బాబు, ప్రభాకర్, సురేఖతోపాటు దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, ఆర్డీసీ రామకృష్ణరావు, ఏడీసీ జ్యోతి, డీసీ సంధ్యారాణి, ఈఓ మహేశ్‌ను సన్మానించారు.

పూజలో పాల్గొన రాష్ట్ర మంత్రులు

ఈసీ అనుమతితో మహోత్తర ఘట్టం మహాకుంభాభిషేక మహోత్సవానికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ప్రధాన ఆలయంపై గోపురంపై జరిగిన సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారి ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. శుభానందాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యార్, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, ఆర్జేసీ రామకృష్ణరావు, ఏడీసీ జ్యోతి, డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, ఈఓ మహేశ్ పాల్గొన్నారు.

వీక్షణకు తరలిన భక్తులు..

42 ఏళ్ల తరువాత మహాకుంభాభిషేకం ఘట్టం పూర్తయింది. ఈ ఘట్టాన్ని తిలకించడానికి తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా, మూడు రోజుల పాటు కాళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి సుస్మిత ఆధ్వర్యంలో సేవలు అందించారు. ఆర్టీసీ భూపాలపల్లి డీఎం ఇందు ఆధ్వర్యంలో బస్సులు రాకపోకలు సాగించాయి. అలాగే, ఎస్పీకిరణ్‌ఖరే, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రామచంద్రరావు, నాగార్జునారావు, ఎస్సై తమాషారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీటు.. ఫైట్

● ఆర్టీసీ బస్సులో యువకుల ఘర్షణ



బస్సులో కొట్టుకుంటున్న ప్రయాణికులు

తొర్రూరు: సీటు కోసం ఆర్టీసీ బస్సులో యువకులు కొట్టుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు బస్టాండులో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. తొర్రూరు నుంచి హైదరాబాద్–జగదిరిగుట్టకు వెళ్లే ఆర్టీసీ చివరి బస్సు శనివారం రాత్రి స్థానిక బస్టాండ్‌లో నిలిచింది. ఈ క్రమంలో సీటు కోసం ఇద్దరు యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. నేను కర్చీఫ్ వేశానంటే నేనే వేశానంటూ మొదలైన మాటల యుద్ధం చివరికి కొట్టుకునే వరకు వెళ్లింది. సహ ప్రయాణికులు కలుగజేసుకొని వారిని విడదీశారు. అక్కడికి పోలీసులు చేరుకుని ప్రయాణికులను శాంతింపజేశారు.



ప్రయాణికులను విచారిస్తున్న పోలీసులు

చెరువులో పడి వ్యక్తి మృతి



నాగేందర్(ఫైల్)

కాళేశ్వరం: మద్యం మత్తులో ఓ వ్యక్తి బహిర్భూమికి వెళ్లి చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎర్రచెరువులో చోటు చేసుకుంది. హనుమకొండ జిల్లా హసన్‌పర్తికి చెందిన మేడం నాగేందర్(46) బహిర్భూమికి వెళ్లి ఎర్రచెరువులో పడి నీటమునిగి మృతి చెందాడు. ఈఘటనపై మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ ఆదివారం తెలిపారు.

సాంస్కృతిక ఉత్సవంతో దివ్యాంగుల ప్రతిభ వెలుగులోకి..



ఉత్సవంలో దివ్యాంగ కళాకారుల ప్రదర్శనలు





● దివ్యాంగుల సంక్షేమ శాఖ హనుమకొండ అధికారి జయంతి

విద్యారణ్యపురి: దివ్యాంగ కళాకారుల ప్రతిభను వెలికితీసేందుకు సాంస్కృతిక ఉత్సవం దోహదం చేస్తుందని దివ్యాంగుల సంక్షేమ శాఖ హనుమకొండ అధికారి జె. జయంతి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల దివ్యాంగుల సాంస్కృతిక ఉత్సవం–2025 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జయంతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. దివ్యాంగుల కళలు సమాజానికి తెలిసేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్న విద్య ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ప్రముఖ సాహితీవేత్త, హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య మాట్లాడుతూ దివ్యాంగుల్లోనూ అద్భుత కళలు దాగి ఉన్నాయని, వాటిని వెలికి తీసేలా విద్య ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్య ఫౌండేషన్ అధ్యక్షుడు బిల్ల మహేందర్ మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడం.. వారి కళలను సమాజానికి పరిచయం చేయడానికి ఈ సాంస్కృతిక ఉత్సవం నిర్వహిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పొట్లపెల్లి శ్రీనివాస్‌రావు, ఈవి శ్రీనివాస్‌రావు, బాధ్యులు కార్తీక రాజు, గిరిజాల తిరుపతిరెడ్డి, కె. మాధవి రెడ్డి, అనితారెడ్డి, రోటరీక్లబ్ బాధ్యులు ఎస్. ప్రభాకర్, ప్రవీణ్‌రావు, దేవాసంఘం బాధ్యులు హబీబ్ మియా లక్ష్మయ్య మాట్లాడారు. మల్లికాంబ మనోవికాస కేంద్రం నుంచి రామలీల, బనన మనోవికాస కేంద్రం నుంచి కిరణ్మయి, విద్య ఫౌండేషన్ బాధ్యులు కె. నరేందర్, కె. కృష్ణయ్య, శ్రీనివాస్, రవికుమార్, మల్లికార్జున్, గట్టు రాధిక, సరిత,గజ్జల స్వరూపరాణి, వాణీరాణి, రాజిరెడ్డి, ఉషారాణి, కరుణశ్రీ, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, కళాభిమానులు పాల్గొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 50 మంది దివ్యాంగ కళాకారులు తమ సాంస్కృతిక అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పాటలు, డ్యాన్స్, చిత్రకళ, మైమ్, రావిఆకుల మీద ఆర్ట్స్, మిమిక్రీ, కీప్యాడ్, తబల ప్రదర్శనలు నిర్వహించారు.

అప్పల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

● కరుణాపురంలో ఘటన

ధర్మసాగర్: అప్పుల బాధతో ఓ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కరుణాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొస్కుల యాదగిరి (45) నాలుగు ఎకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పెట్టుబడుల కోసం సుమారు రూ. 3 లక్షలకుపైన అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది శనివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

భార్యతో గొడవ పడి వ్యక్తి..

మంగపేట : మండల కేంద్రంలోని పద్మశాలి వాడకు చెందిన చెందిన కోడం సురేశ్ (45) గౌరారంవాగుపై నిర్మించిన లోలెవల్ బ్రిడ్జికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. ఎస్సై కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సురేశ్‌కు ఏటూరునాగారం గ్రామానికి చెందిన రేణుకతో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యతో కలిసి ఏటూరునాగారంలో ఉంటున్నాడు. సురేశ్ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడి మండల కేంద్రంలో ఉంటున్న తన తల్లి, అక్క ఇంటికి వచ్చి కొద్దిరోజులు ఉండి తిరిగి వెళ్లేవాడు. అదే క్రమంలో 15 రోజుల క్రితం భార్యతో గొడవపడి మంగపేటలోని తన అక్క ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం మంగపేట– బోరునర్సాపురం గ్రామాల మధ్య గల బ్రిడ్జికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శవ పంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి తల్లి, భార్య రేణుక, కూతురు ఉన్నారు.

మేడారానికి జాతర కళ..

● మినీ జాతరకు మిగిలింది రెండు రోజులే..
● తరలివచ్చిన వేలాది మంది భక్తులు
● కిక్కిరిసిన అమ్మవార్ల గద్దెలు
● ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు



తల్లుల గద్దెల వద్ద భక్తుల మొక్కులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతరకు ఇంకా రెండు రోజుల సమయమే మిగిలింది. దీంతో జాతర ప్రాంగణం, పరిసరాలు కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం అమ్మవార్లను దర్శించుకునేందుకు తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మొదట జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో పుట్టువెంట్రుకలు సమర్పించుకున్నారు. వనదేవతల గద్దెల వద్ద కానులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యాటలు, కోళ్లను అమ్మవార్లకు మొక్కుగా చెల్లించుకున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా దేవాదాయశాఖ సిబ్బంది సేవలందించారు. సుమారు 20వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. కాగా, సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కిక్కిరిసిన అమ్మవార్ల గద్దెలు..

భక్తులు వేలాదిగా తరలిరావడంతో అమ్మవార్ల గద్దెలు కిక్కిరిశాయి. భక్తుల తాకిడి పెరగడంతో పోలీసు అధికారులు క్యూలైన్ ద్వారా నేరుగా సమ్మక్క, సారలమ్మ గద్దెలపైకి పంపించి మొక్కుల అప్పగించిన వెంటనే బయటకు పంపించారు. డీఎస్పీ రవీందర్ పర్యవేక్షణలో పస్రా సీఐ రవీందర్, సిబ్బంది భక్తుల వాహనాలు ట్రాఫిక్ జామ్ కాకుండా కట్టుదిట్ట చర్యలు తీసుకున్నారు. మేడారంలో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యల కోసం సుమారు 300 మంది పోలీసులు సేవలందించారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం ఆర్టీసీ బస్టాండ్, చిలకలగుట్ట, జంపన్నవాగు పరిసరాల్లో విడిది చేసి వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేసి సందడి చేశారు.



షవర్ల కింద స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



జాతర పరిసరాల్లో విడిది చేస్తున్న భక్తులు

పారిశుద్ధ్య చర్యలు..

మేడారంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా కార్మికులు పనులు చేశారు. డీపీఓ దేవరాజ్ పర్యవేక్షణలో ఎంపీఓ శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు జంపన్న వాగు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వైజంక్షన్, చిలకలగుట్ట, ఇంగ్లిష్ మీడియం పాఠశాల పరిసరాల ప్రాంతాల్లో చెత్తను తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ ప్రాంతాలకు తరలించారు.

జాతరలో భక్తులకు సకల సౌకర్యాలు

● రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

మేడారం సమ్మక్క– సారలమ్మ మినీ జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాల కల్పించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈమేరకు ఆదివారం మేడారంలో భక్తుల సౌకర్యార్థం పూర్తి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ పూజారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 15వతేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే మినీ మేడారం జాతరకు 10 నుంచి 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశామన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా వైద్య సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటుందన్నారు. గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల వద్ద తొక్కిసలాట జరగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జంపన్న వాగు, గద్దెల ప్రాంతం, మేడారం పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. రూ. 5. 30 కోట్లతో వివిధ పనులు పూర్తి చేశామని వివరించారు. అంతకుముందు మంత్రి సీతక్క అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ పాల్గొన్నారు.



గంట కొడుతున్న సీతక్క

15 కిలోల ఎండు గంజాయి పట్టివేత

● వ్యక్తి అరెస్ట్, రిమాండ్

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో ఒడిశాలోని భద్రక్ జిల్లా ముళ్ల సాహి గ్రామానికి చెందిన సుమన్ ఖాద్రీ బ్యాగు పరిశీలించగా రూ.3,90,775 విలువైన 15 కేజీల 631 గ్రాముల ఎండు గంజాయి లభించింది. వెంటనే అదుపులోకి తీసుకుని విచారించగా భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్‌కు రైలులో గంజాయి రవాణా చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో అరెస్ట్ చేసి సరుకు స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం జీఆర్ పోలీసులకు అప్పగించినట్లు ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుడు సుమన్ ఖాద్రీపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పి. సురేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఏఎస్సై పితాంబర్ రావు, హెడ్ కానిస్టేబుల్ రాజు, నాగరాజు పాల్గొన్నారు.

కీలక పదవుల్లో ఆ ప్రొఫెసర్లనే నియమించే అవకాశం!

● వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ మనోహర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మూడు కీలక పదవుల్లో ఆ ముగ్గురు ప్రొఫెసర్లకు అవకాశం లభించబోతుంది. కేయూ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్, సోషల్ సైన్స్ డీన్ టి. మనోహర్‌ను యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించబోతున్నారు. ప్రస్తుత యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎకనామిక్స్ విభాగం అధిపతి, కేయూ పాలకమండలి సభ్యుడు బి. సురేశ్‌లాల్‌ను యూనివర్సిటీ సీడీసీ డీన్‌గా నియమించబోతున్నారని సమాచారం. అయితే సీడీసీ డీన్‌గా ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య కూడా ప్రయత్నాలు చేశారు. దీంతో ఎవరిని నియమించాలనే అంశంపై వీసీ ప్రతాప్‌రెడ్డి కొద్దిరోజులుగా జాప్యం చేస్తూ వస్తున్నారు. సీడీసీ డీన్‌గా బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్‌ను నియమించాలనే అంశంపై కూడా వీసీపై ఒత్తిడి వచ్చినట్లు సమాచారం.అయితే ప్రొఫెసర్ సురేశ్‌లాల్ తనకే సీడీసీ డీన్ పదవి ఇవ్వాలని వీసీపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు యూనివర్సిటీలో చర్చ జరుగుతోంది. కేయూ పాలకమండలి సభ్యుడు కావడంతో సురేశ్‌లాల్‌నే సీడీసీ డీన్‌గా నియమించేందుకు వీసీ మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఆయననే ఖరారు చేశారని తెలుస్తోంది. ప్రస్తుతం సీడీసీ డీన్‌గా రిజిస్ట్రార్ రామచంద్రం కొనసాగుతున్నారు. మరోవైపు కేయూ దూరవిద్యకేంద్రం డైరెక్టర్‌గా యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ పి. వరలక్ష్మిని నియమించబోతున్నారు. ఆయా మూడు కీలక పదవుల్లో ఆ ముగ్గురు ప్రొఫెసర్లనే త్వరలోనే నియమించే అవకాశాలున్నాయి. దాదాపు ఆ మూడు పదవులకు ఆ ముగ్గురు ఖరారు అయినట్లేననే యూనివర్సిటీలో చర్చ జరుగుతోంది. ఒకటిరెండురోజుల్లోనే ప్రొఫెసర్ మనోహర్‌కు యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, ప్రొఫెసర్ సురేశ్‌లాల్‌కు సీడీసీ డీన్‌గా, ప్రొఫెసర్ వరలక్ష్మికి ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా నియామక ఉత్తర్వులు ఇచ్చే అవకాశాలున్నాయి.